# మిడ్‌నైట్ ఛానెల్

## ఏకపత్నీవ్రతుడు

బొమ్మిడి అచ్చారావు

**'మా ఆయన శ్రీరామచంద్రుడు. పరాయి ఆడదాని నీడ కూడా తొక్కడు. ఆడవాళ్ళ గాలిసోక కుండా ఆమడదూరం తొలగిపోతాడు' గర్వంగా చెప్పింది ఉష.**

''ఆ, పోవోయ్, పెద్ద గొప్ప! నీ మొగుడేదో ప్రవరాఖ్యుడన్నట్టు ఫోజు! నూటికి తొంభై తొమ్మిది మంది మగాళ్ళు ఆడదాన్ని చూడగానే చొంగ కార్చుకుంటూ ఆశగా చూడటం నేనెన్నోసార్లు అనుభవపూర్వకంగా చూశాను'' చెప్పింది అమల.

''అమల చెప్పింది నూటికి నూరుపాళ్ళు కరెక్ట్! ఏమాత్రం అవకాశం దొరికినా ఆడదాన్ని అనుభవించటానికే చూసే మగాళ్ళు కోకొల్లలు. అంతెందుకు, నా మొగుడ్నే తీసుకోరాదూ; నాతో వస్తూనే ఆడవాళ్ళకేసి ఆబగా చూస్తుంటాడు. గుటకలు మింగుతాడు. ఆ క్షణం నేను పక్కన లేకపోతే దేన్నో ఎత్తుకు పోతాడేమోననిపిస్తుంది. ఎప్పటికప్పుడు మాటల మొట్టికాయలు వేసి దారి తప్పకుండా జాగ్రత్తలు తీసుకుంటాను'' నళిని చెప్పింది.

''ఈ మగాళ్ళు మనల్ని ఆడిపోసుకుంటారు గాని, వాళ్ళకి నీతి నియమాలు, సెంటిమెంట్లు ఉండవు. అవకాశవాదులు. మనం పురిటికి వెళ్ళినప్పుడో మరొక్కప్పుడో పుట్టింట్లో వుంటే, అప్పుడు చూడాలి వీళ్ళ రాసక్రీడలు! నేనోసారి మా చెల్లెలు పెళ్ళికి మా పుట్టింటికి వెళ్ళాను. తనని రమ్మంటే సెలవు లేదు, పెళ్ళి రోజునాటికి తప్పకుండా వస్తానన్నారు. అన్నట్టుగానే పెళ్ళి నాటికి వచ్చి మళ్ళీ ఆఫీస్‌లో ఇన్‌స్పెక్షన్ ఏదో వుందని అర్జంటుగా వెళ్ళిపోయారు. పుట్టింటికి వచ్చిన వాళ్ళం అంత తొందరగా ఎలా వెళ్ళిపోతాం? పైగా మా చెల్లెలుకు నాతో ఇంటి మసీ ఎక్కువ. దాంతో ఓ వారం పుట్టింట్లో ఉన్నాను. తిరిగొచ్చేసరికి అసలు సంగతి తెలిసింది - పక్కింటి వనజ వల్ల. నేను లేనప్పుడు నా మొగుడు దేన్నో ఇంటికి తెచ్చుకున్నారని! ఛడామడా కడిగేశాను. నిజం ఒప్పేసుకున్నారు. మళ్ళీ అలాంటి వెర్రి మొర్రి వేషాలేస్తే విడాకులిచ్చేస్తానన్నాను. పాపం, బెదిరిపోయారు. మళ్ళీ ఇప్పటిదాకా బాగానే వున్నారు. కాని నమ్మలేం, మగబుద్ధి కొత్త కొత్త రుచుల కోసం అర్రులు చాస్తుంది. మన జాగ్రత్తలో మనం వుండి మొగుడ్ని నాలుగు కళ్ళతో కాచుకోవాలి'' చెప్పింది అమల.

'ఏమో మరి, మా వారు మాత్రం పెళ్ళయి మూడేళ్ళయినా మరో ఆడదాన్ని కన్నెత్తి చూడలేదు మరి! ఆయనకు నేనంటే ప్రాణం, ఇంటి దగ్గరున్నంత సేపూ నా నామస్మరణే! ఒక విధంగా చెప్పాలంటే నా కొంగు పట్టుకు తిరుగుతారు. మా వాళ్ళందరూ నేను చాలా అదృష్టవంతురాలినని చెపుతారు'' మళ్ళీ తన వాదనను సమర్థించుకుంది ఉష.

నళిని - అంతవరకు చర్చలో పాల్గొనకుండా కేవలం ప్రేక్షకురాలిగా వుండిపోయిన తమ నాలుగో కొలీగ్ అయిన హరిత వంక చూసి, ''ఏమిటమ్మాయ్, నువ్వేంటి ఇంత మౌనంగా వున్నావు? మగాళ్ళ గురించి వాళ్ళ పిచ్చివేషాల గురించి కొరడా ఝుళిపించే రుద్రనారివి, ఇప్పుడేం మూగబోయావు?'' అనడిగింది.

హరిత నోరు విప్పింది. ''మీరందరు పెళ్ళయిన వాళ్ళు. నేనొక్కదాన్ని అన్ మేరీడ్. మీ మొగుళ్ళ ముచ్చట్లలో మీరు మునిగిపోయి వున్నారు. సరే, ఎంతసేపు చెప్పుకుంటారో చూద్దామని నేను వెయిట్ చేస్తున్నా... నువ్వు, అమల - మగాళ్ళ గురించి, మీ మొగుళ్ళ గురించి నగ్నసత్యాలు చెప్పారు. ఓకే! బట్, ఉషేంటి, వాళ్ళాయన శ్రీరామచంద్రుడు, శ్రితపారిజాతుడు, భార్యావిధేయుడు అంటూ డప్పాలు కొడుతోంది!''

ఉషకి ఉక్రోషం వచ్చేసింది. ''డప్పాలు కాదు, అప్పాలు కాదు. ఉన్న నిజం చెప్పాను. మా వారు భార్యా విధేయులని చెప్పలేదు. ఏకపత్నీ వ్రతులని చెపుతున్నాను. ఇప్పటి వరకు - పెళ్ళికి ముందు కూడా - ఆయనకు ఏ ఆడపిల్లతోను అక్రమ సంబంధాల్లేవు. పవిత్రత ఆడవాళ్ళకే కాదు, మగాళ్ళక్కూడా చాలా అవసరమని అస్తమాను నాతో అంటుంటారు. అనుకూలవతి, అందగత్తె అయిన భార్య ఇంట్లో కంటి కింపుగా నడయాడుతుంటే, చిరుతిళ్ళకోసం ఎగబడే వాళ్ళు - మగైనా సరే, ఆడైనా సరే - తూర్పారబడతారాయన. నేనేకాదు, మీరైనా సరే, ఆయనలో ఏమాత్రం లోపం చూపించగలి




గినా నేను ఎంతయినా బెట్ చేస్తాను'' అన్నది.

''బెట్ ఏంవేస్తావు?'' అడిగింది హరిత.

''ఏం వెయ్యమంటావు?'' ఎదురు ప్రశ్న వేసింది ఉష.

''మీ ఆయన ఏకపత్నీవ్రతుడు కాదని నిరూపిస్తాను. మీ ఆయనకు విడాకులిచ్చేస్తావా?'' అడిగింది హరిత.

ఉష విస్తుపోయింది. 'ఇదేం బెట్?'' అన్నది.

''మరి! డబ్బు, వస్తువులు బెట్ చెయ్యటం ఓల్డ్ ఫాషన్. భర్తల్ని బెట్ చెయ్యటం మోడరన్'' చెప్పింది హరిత.

''నేను ఆయనకు విడాకులిచ్చేస్తే నీకేంటి లాభం?'' అడిగింది ఉష.

''ఏముంది? వెంటనే అతన్ని నేను పెళ్ళి చేసుకుందామని!'' కూల్‌గా చెప్పింది హరిత.

అమల, నళిని గొల్లున నవ్వారు.

ఉష ఉడుక్కుంది. హరిత కళ్ళెగరేసింది.


అమల కల్పించుకుని, ''సరదాగా వేసుకునే బెట్... అయిదు వందలో, వెయ్యో వేసుకోండి, చాలు'' అన్నది.

ఉష వెంటనే ''రెండు వేలు'' అంది.

హరిత పెదవి విరిచి, ''ఆల్‌రైట్, ఏం చేస్తాం? అలాగే కానియ్యి. అయినా మీ ఆయన మరో ఆడదానితో సంబంధం పెట్టుకున్నాక ఇంకా అతనితో సంసారం చెయ్యటం శుద్ధ దండగ. అయినా నీ మొగుడు నీ ఇష్టం, నాకెందుగ్గానీ ఆ రెండు వేల రూపాయల బెట్టే ఖాయం చేద్దాం'' అన్నది.

''అయితే ఎప్పటిలోగా పందెం గెలుస్తావు?'' అడిగింది ఉష.

''ఎప్పుడో ఎందుకు? ఈరోజే! మీ వార్ని ఫోటోలో చూశాను, కాని మీ వారు పనిచేసే ఆఫీసు, వివరాలు చెప్పు. ఇంకొక్కపూట టైమిచ్చినా నువ్వు మీ ఆయనతో కుమ్మక్కయిపోయి, అస్సలు లొంగ



వద్దని అతనికి చెప్పే ప్రమాదముంది'' అన్నది హరిత.

ఉష ఉక్రోషంగా చూసిందామెవంక.

''నేనలా చెప్పాల్సిన అవసరమేమీలేదు. మా వారు ఎంత నిగ్రహపరుడో, పరాయి స్త్రీలను ఎంత పవిత్ర భావంతో చూస్తాడో నీకే తెలుస్తుంది... వెళ్ళు ...'' అన్నది ఉష.

నళిని చెప్పింది ''సరదాగా వేసుకున్న బెట్. సరదాగానే ట్రీట్ చేద్దాం. నో సీరియస్‌నెస్ ... ఇంతకీ ఎవర్ని ప్రయోగిస్తున్నావు తల్లీ రమాపతి గారి మీద?'' అడిగింది.

హరిత తేలిగ్గా నవ్వేసి, ''ఎవరో ఎందుకు? నేనే ఆయన పాలిట మేనకను. తపోభంగం చెయ్యటానికి దివి నుంచి దిగొచ్చాను. నన్నాయన ఎప్పుడూ చూడ లేదు కాబట్టి గుర్తుపట్టే ప్రమాదం లేదు. ఉష పెళ్ళి ఫోటోలో అతన్ని నేను చూశాను'' అన్నది.

అమల ఆశ్చర్యంగా చూసింది. ''తపో భంగం చెయ్యబోయి నువ్వు భంగపడి పోయినా, అతను నిన్ను ఏమైనా చేసినా, ఎందుకు రిస్క్? పెళ్ళి కావల సిన దానివి, ఏమైనా ప్రమాదం కదా!''

ఉషకి మళ్ళీ ఉక్రోషమొచ్చేసింది.. ''ఆయన 'ఏమైనా' ఏమీ చెయ్యరు. హరిత శీలానికొచ్చిన ప్రమాద మేమీలేదు'' అన్నది.

రెండు గంటలయింది. లంచవర్ కాస్తా అయి పోయింది. నలుగురు కొలీగ్స్ ఎవరి సీట్లలోకి వాళ్ళు వెళ్ళిపోయారు. లి

OOO

''హల్లో, కాస్త స్కూటర్ ఆపుతారా?'' బస్టాప్‌లో నించున్న హరిత గబుక్కున రోడ్డుమీది కొచ్చి స్కూటర్ని చెయ్యెత్తి ఆపింది.

రమాపతి ఆఫీసు పక్కనే వున్న బస్టాప్ అది. అక్కడ నిల్చుంటే రమాపతి ఆఫీసు నించి బయట కొచ్చి ఎటు వెళ్తాడో స్పష్టంగా గమనించవచ్చు.

హరిత ఓ గంట ముందుగానే తమ ఆఫీసు నించి బయటపడి ఆ బస్టాప్‌లో దాదాపు అరగంట నుంచి వేచి వున్నది. రమాపతి స్కూటర్ మీద రాగానే అడ్డు వెళ్ళి ఆపేసింది.

సడన్‌బ్రేక్ వేసి స్కూటర్ని ఆపాడు రమాపతి.

''ఏమిటండీ, ఏమయింది?'' అనడిగాడు

> **''సరదాగా వేసుకున్న బెట్. సరదాగానే ట్రీట్ చేద్దాం. నో సీరియస్‌నెస్ ... ఇంతకీ ఎవర్ని ప్రయోగిస్తున్నావు తల్లీ రమాపతి గారి మీద?''**

కంగారుగా.

''అబ్బే! ఏం కాలేదండి. బస్‌కోసం అరగంట నుంచి వెయిట్ చేస్తున్నాను. రాలేదు. ఇంటికి అర్జం టుగా వెళ్ళాలి. కాస్త లిఫ్ట్ ఇస్తారేమోనని!'' అన్నది అతని ముఖంలోకి పరీక్షగా చూస్తూ.

''సారీ, ఏమనుకోకండి. ఆడవాళ్ళకి లిఫ్ట్ ఇవ్వడంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. మీకు తెలి యదు. నేను నా భార్యను తప్ప పరాయి ఆడవాళ్ళని వెనక సీట్ మీద ఎక్కించను. ఇప్పటివరకు ఆ పాలసీనే ఫాలో అవుతున్నాను'' చెప్పాడు రమాపతి.

'ఏడ్చినట్టే వుంది నీ పాలసీ' అని మనసులోనే తిట్టుకుని, పైకి మాత్రం ఫక్కున నవ్వింది హరిత.

''గొప్ప పాలసీనే! నేను మీ వెనక ఎక్కి కూచు న్నంత మాత్రాన మీరేమీ మైలపడిపోరుగాని, ఆగండి మహానుభావా! .. పది స్కూటర్లనైనా ఆపటానికి ప్రయత్నించి విఫలమయ్యాను. మీరొక్కరు ఆగారు, థాంక్స్! మీరు కూడా వెళ్ళిపోతే నాగతేం కాను?'' అన్నది హరిత.

రమాపతి కంగారుపడి పోతున్నాడు. ఆమె వెనక సీటు మీద ఎక్కడ ఎక్కి కూచుంటుందోనని భయపడ్డాడు. కాని అదృష్టవశాత్తు ఆమె అలాంటి ప్రయత్నమేదీ చెయ్యకపోవటంతో తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు.

''అయినా ఇంకా ఆగమంటుందేం?'' మనసు అంతరాంతరాలలో ఏదో అనుమానపొర!

హరిత దాదాపు అతన్ని ఒరుసుకుంటున్నంత దగ్గరగా నిల్చుని అతని ముఖంలోకి చూస్తోంది. ఆమె ఊపిరి అతని చెంపలకు వెచ్చగా తాకుతోంది. అతనికి గిలిగింతలు పెట్టినట్టు అనిపించింది.

''మీరు ఫ్రీగానే ఉన్నారా? ఎక్కడికైనా వెళ్ళాలా?''

''మా ఆవిడతో షాపింగ్‌కి వెళ్ళాలి ...''

''సొంత పెళ్ళాంతో షాపింగ్‌కి వెళ్ళటంలో థ్రిల్ ఏముంటుంది సార్? ... అందుకని అర్జంటు గా ఆఫీసు నుంచి ఇంటికి పారిపోతున్నారా? మీక్కా వాలంటే చెప్పండి, షాపింగ్‌కి నేను కంపెనీ ఇస్తాను మీకు!''

''మీరా?'' ఆశ్చర్యంగా చూశాడు రమాపతి.

''ఏం? మీ ఆవిడ కన్నా తీసిపోయానా నేను? అన్నట్టు మీ ఆవిడ నాకన్నా అందంగా, ఫాషన్‌బుల్‌గా వుంటుందా? చెప్పండి ...'' అన్నది హరిత.

''ఆమె సంగతేమోగాని మీరు మాత్రం చాలా ఫ్యాషన్‌బుల్‌గా వున్నారు. కాని ... నేను పరాయి స్త్రీలతో మూవ్ కానండి.''

''ఇంకా నన్ను పరాయిగానే చూస్తున్నారా? ... మీకు అభ్యంతరం లేకపోతే అలా ఏదైనా పిక్చరుకి వెళ్ళి, ఆ తర్వాత ఉడ్‌లాండ్స్‌లో మంచి టిఫిన్ చేసి కాసేపు సరదాగా ఎక్కడైనా గడుపుదాం ... ఏమం టారు?'' అడిగింది హరిత.

రమాపతి నిర్ఘాంత పోయి చూశాడు. అతనికీ అనుభవం కొత్తగా థ్రిల్లింగ్‌గా వుంది. అయితే అప్ప టికే చుట్టుపక్కల వాళ్ళంతా తమనే గమనిస్తున్నారని గ్రహించి, స్కూటర్ని నడిపిస్తూ ''ముందు ఇక్క డ్నుంచి కదులుదాం. అందరు మనల్నే చూస్తు న్నారు'' అన్నాడు.

''నడుస్తూ ఏం వెళ్తాంలెండి? స్కూటర్ స్టార్ట్ చెయ్యండి. వెనకాల ఎక్కేస్తున్నాను'' అంటూ అతని

జవాబుకోసం ఎదురు చూడకుండా స్కూటర్ ఎక్కేసింది హరిత.

అందమైన ఆ అమ్మాయి అంత చొరవ తీసుకుని అడుగుతుంటే, కాదంటే చులకనై పోతాననే ఆలోచన వచ్చింది రమాపతికి.

వెంటనే స్కూటర్ స్టార్ట్ చేసి ''ఎక్కడకు వెళ్దాం చెప్పండి'' అన్నాడు.

''ముందు ఉడ్‌లాండ్స్‌కి పోనివ్వండి. ఆకలిగా వుంది. శుభ్రంగా సాంబారు ఇడ్లీ, దోశ లాగించాక ఏ పిక్చరుకు వెళ్ళాలో ఆలోచిద్దాం'' అన్నది హరిత.

స్కూటర్ని ఆమె చెప్పినట్టుగానే ఉడ్‌లాండ్స్ హోటల్‌కి పోనిచ్చాడు రమాకాంత్. స్కూటర్ లాక్‌చేసి హోటల్లోని ఫేమిలీ సెక్షన్ వైపు దారి తీశాడు. హరిత అనుసరించింది.

పీకల వరకు టిఫిన్ దట్టించాక అడిగాడామెని.

''ఏం పిక్చరుకి పోదాం?''

హరిత ఒకసారి బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంది. పమిట జారిపోయింది. ఆమె ఎద పొంగులు రమాపతికి కనువిందు చేశాయి. అతనిలోని మగాడు 'నీదే ఆలస్యం? ప్రొసీడ్!' అంటున్నాడు.

''పోనీ, పిక్చర్ కాన్సిల్ చేసేద్దాం. సరదాగా హోటల్‌రూమ్‌లో గడిపేద్దామా?'' అన్నది హరిత అతనికి కన్నుకొట్టి.

రమాపతిలోని మగాడు 'సై' అన్నాడు.

రిసెప్షన్‌లోకి వెళ్ళి ఫేమిలీ రూం బుక్ చేశాడు రమాపతి.

''రూం నెంబరు ఎంత?'' అడిగిందామె.

చెప్పాడు రమాపతి.

ఆమె వెంటరాగా అతను అప్‌స్టెయిర్స్ వైపు నడిచాడు.


హరిత ''ఒక్క క్షణం'' అంటూ వెనక్కు వచ్చి రిసెప్షన్‌లో ఫోన్ అందుకుని ఎక్కడికో ఫోన్ చేసింది.

ఆ తర్వాత తనకోసం మెట్ల మీద ఎదురు చూస్తున్న రమాపతిని కలిసింది.

''మా ఇంటికి ఫోన్ చేశాను. అన్నట్టు నా గురించి వివరాలు చెప్పలేదు కదూ! ఫైనల్ బిఎస్సీ చదువుతున్నాను. ప్రయివేట్ క్లాసుందని మా ఇంటికి ఫోన్ చేశాను. లేకుంటే వాళ్ళకు నా మీద అనుమానం వచ్చేస్తుంది. బయటకు రానివ్వరు'' నవ్వింది అతన్ని చూసి.

ఇద్దరు తమకు ఎలాట్ చేసిన రూమ్ దగ్గర ఆగారు. తాళం తెరిచిలోనికి అడుగు పెట్టాడు రమాపతి.

రూమ్ చాలా నీట్‌గా వుంది. ఒకటే బెడ్. దాని




మీద మల్లెపూవు కన్నా తెల్లగా వున్న దుప్పటి పరచి వుంది. రెండు ఛెయిర్స్, ఓ డ్రెస్సింగ్ టేబిల్ ఓ పక్కగా వున్నాయి. ఎ.సి వుంది. ఆన్ చేశాడు రమాపతి.

చల్లటి గాలి వాళ్ళిద్దర్ని సాదరంగా ఆహ్వానించింది.

హరితను చూస్తుంటే తనను తాను నిగ్రహించుకోలేక పోతున్నాడు రమాపతి. ఆమె చాలా

**''నువ్వింత చంచల స్వభావుడవని అనుకోలేదు. నీతి కబుర్లు చెప్పి ఎన్నాళ్ళు మోసం చెయ్యాలనుకున్నావు? ఈ రోజుతో మనిద్దరి మధ్య ఎలాంటి సంబంధం లేదు. గుడ్‌బై ఫరెవర్!''**

అందంగా వుంది. అంతకన్నా ఆకర్షణీయంగా అలంకరించుకుంది. హైగా కాలేజీ...గర్ల్! ఫాషనబుల్‌గా వుంది. ఆమెతో పోల్చుకుంటే తన భార్య ఉషది చాలా సామాన్యమైన అందం. అసలు ఆమె అందగత్తెల్లో లెక్కకాదు. అయితే ఉద్యోగం చేస్తూండటం వల్ల వేణ్నీళ్ళకు చన్నీళ్ళలా, ఆర్థికంగా తనకు తోడ్పాటుగా వుంటుందని, కట్నం కూడా పెద్దగా ఆశించకుండా పెళ్ళి చేసుకున్నాడు. ఇప్పుడీ అమ్మాయిని చూస్తుంటే, తను పొరపాటు చెయ్యలేదు కదా ... అనిపిస్తోంది.

రమాపతి మంచం మీద కూలబడ్డాడు.

''రా, ఇలా వచ్చి కూచో ...'' అన్నాడు.

హరిత అతని పక్కగా వచ్చి కూచుంది.

''నిన్ను చూస్తుంటే నా మనసు నిలవటం లేదు. ఇంకా ఆలస్యమెందుకు? ...'' అంటూ ఆమెను కౌగిట్లో బంధించబోయాడు.

హరిత విజయ గర్వంతో లోలోన నవ్వుకుంది.

''అంత తొందరయితే ఎలా? మనం ఒకర్నొకరు బాగా అర్థం చేసుకోవాలి. మీకు పెళ్ళయిందేమో కదా ... ఆమె సంగతేమిటి?'' అన్నది హరిత క్రీగంట చూస్తూ.

''ఆమెతో బాటు నువ్వు వుందువుగాని! నిన్ను వేరే చోట వుంచుతాను. ఆమెకు తెలవనివ్వను ...''

''అలాక్కాదు ... ఆమెని ఒదిలేసి నన్నే చేసుకుంటానంటేనే నేను మీ కోరిక తీరుస్తాను ...''

''ఓ, అలాగే! ఆలస్యం చేసేకొద్దీ నా మనసు నా మాట వినటం లేదు ...'' అంటూ చటుక్కున హరితను సందిట బంధించి ఆమె పెదాలను తన పెదాలతో అందుకోబోయాడు.

అంతే! భళ్ళున తలుపులు తెరుచుకున్నాయి.

గుమ్మం వైపు చూసిన రమాపతికి నోటమాట లేదు. స్థాణువులా ఉండిపోయాడు.

ముందు తన భార్య ఉష, ఆ తర్వాత ఆమె కొలీగ్స్ కాబోలు - ఇద్దరు స్త్రీలు - లోనికొచ్చారు.

''నువ్వింత చంచల స్వభావుడవని అనుకోలేదు. నీతి కబుర్లు చెప్పి ఎన్నాళ్ళు మోసం చెయ్యాలనుకున్నావు? ఈ రోజుతో మనిద్దరి మధ్య ఎలాంటి సంబంధం లేదు. గుడ్‌బై ఫరెవర్!'' అంటూ మహోగ్రంగా బయటకు వెళ్ళిపోయింది ఉష. నళిని, అమల, హరిత ఆమె ననుసరించారు.